'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## హసీనా జయభేరి

**బంగ్లాదేశ్** ఎన్నికల్లో ఆ దేశ ప్రధాని షేక్ హసీనా వాజెద్ నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ ఘన విజయం సాధించింది. ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఈ ఎన్నికల్లో పాల్గొనలేదు. దీంతో బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె షేక్ హసీనా సునాయాసంగా ఐదోసారి ప్రధాని పీఠాన్ని చేజిక్కించుకున్నారు. ఈ ఎన్నికల చుట్టూ పలు వివాదాలు ముసరడం తెలిసిందే.

ప్రధాని షేక్ హసీనా ఎన్నికలను జరిపిన తీరుపై అంతర్జాతీయంగా విమర్శలు వచ్చాయి. ఆ దేశ ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీతో పాటు దాని మిత్రపక్షాలు ఈ ఎన్నికలను బహిష్కరించాయి. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలపై జైలుశిక్ష అనుభవిస్తున్న ఆ పార్టీ అధ్యక్షురాలు ఖాలిదా జియా ప్రస్తుతం గృహ నిర్బంధంలో ఉన్నారు. ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు, పలువురు మిత్రపక్షాల నాయకులు ప్రస్తుతం జైలు జీవితం గడుపుతున్నారు. దీంతో ఎన్నికల పోరు ఏకపక్షంగా మారింది. తాజా ఎన్నికల్లో 40 శాతం ఓట్లు పోలవడమే దీనికి నిదర్శనం. 1991లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ తర్వాత రెండో కనిష్ఠ ఓటింగ్ శాతంగా దీన్ని పేర్కొంటున్నారు. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని అగ్రరాజ్యం అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు విమర్శించాయి. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సైతం ఎన్నికలు జరిగిన వాతావరణంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఒక పార్టీ పార్లమెంట్ మాత్రమే ఏర్పడిందని అవామీ లీగ్ దాని మిత్రపక్షాలే ఇందులో పాల్గొన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాలను బీఎన్‌పీ మౌనంగా స్వీకరిస్తుందా? లేదా ఆందోళనలకు తెరదీస్తుందా? అనేది వేచిచూడాలి.

ఏదేమైనప్పటికీ మన దేశంతో సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటవడం భారత్‌కు సానుకూల పరిణామమే. మన దేశానికి అనుకూల వ్యక్తిగా పేరున్న ఇబ్రహీం మహమ్మద్ సోలి మాల్దీవులు అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపాలైన ప్రస్తుత తరుణంలో పొరుగునున్న మరో దేశంలో భారత అనుకూల ప్రభుత్వం ఏర్పాటు కావడం ఊరట కలిగించే విషయమే. మాల్దీవులు ప్రస్తుత అధ్యక్షుడు మాయిజ్జు చైనా చేతిలో పావుగా మారి మన దేశంతో కయ్యానికి కాలు దువ్వుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ గెలుపొందడం మనకు వ్యూహాత్మకంగా లాభించే వ్యవహారమే. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్టు ఆరోపణలున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో బంగ్లాదేశ్ సరిహద్దు మరి కొంతకాలం పాటు సురక్షితమనే చెప్పుకోవాలి. పాకిస్థాన్ సరిహద్దు తరహాలోనే అక్రమంగా మన దేశంలోకి చొరబడే ఉగ్రవాదులతో పోరు మన సైనికులకు తప్పింది. ఈ ఎన్నికలు జరిగిన తీరును తప్పుబట్టిన అమెరికా.. బంగ్లాదేశ్‌పై ఆంక్షలు విధించకుండా చూసుకోవాల్సిన బాధ్యత భారత్‌దే. లేకపోతే అమెరికా, పశ్చిమ దేశాల ఆంక్షలను తట్టుకోలేక బంగ్లాదేశ్ కూడా చైనా పంచన చేరే అవకాశం ఉన్నది. ఆ పరిస్థితే తలెత్తితే మాల్దీవులు, పాక్, బంగ్లాదేశ్, శ్రీలంకలను అడ్డుపెట్టుకొని హిందూ మహాసముద్రంపై చైనా ఆధిపత్యం చెలాయించే ప్రమాదం పొంచి ఉన్నది. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా విజయం ఆహ్వానించదగిన పరిణామం.

# నమ్మినోళ్లను నడిరోడ్డుపై..

'ఉండబట్ట లేక ఓటేస్తే.. ఉన్న బట్టా లాక్కున్నట్టు..' అని తెలంగాణ ప్రజా కవి చెరబండరాజు అన్నట్టుగానే రాష్ట్ర ప్రజలు అవస్థల వలయంలో చిక్కిపోయారు. జిరాక్స్ సెంటర్ల వద్ద భారీ క్యూలైన్‌లో నిలబడి కూలబడిపోతున్నారు. ఆరు గ్యారెంటీల కోసం గ్రామాలన్నీ హస్తం పార్టీ నాయకుల ఇండ్ల చుట్టూ బొంగరంలా తిరుగుతున్నాయి. వెరసి హస్తం పార్టీ ప్రభుత్వ 'ప్రజా పాలన' కాస్తా 'ప్రజా వేదనగా' మారిపోయింది. అసలు ఆరు గ్యారెంటీల అర్హులను గుర్తించేందుకు ఇంత హంగామా ఎందుకు? ఆరు గ్యారెంటీల అమలుకు అవసరమైన లబ్ధిదారుల సమాచారం మొత్తం ప్రభుత్వ శాఖల వద్ద అందుబాటులో ఉండగా, దండగమారి దరఖాస్తుల ప్రహసనం నడిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితనం చూసి ప్రజలు జోకులు పేలుస్తున్నారు.



డాక్టర్ ఆంజనేయ గౌడ్



పరమ శివుడి ఫొటో, కైలాసం చిరునామాతో దరఖాస్తులు అందజేస్తున్నారు. వివరాల నమోదులో విచిత్రమైన సమాచారం రాస్తూ, ప్రజా పాలనపై జనాలు ఏమనుకుంటున్నారో చెప్పకనే చెప్తున్నారు. ఖజానా ఖాళీ కుండ అని నిందలేస్తూ, నెల పాలన అవసరానికే దాదాపు రూ.9 వేల కోట్ల అప్పు చేసింది కాంగ్రెస్ సర్కార్. తెలంగాణ పరువును జాతీయ, అంతర్జాతీయ ఆర్థికసంస్థల ముందు సీఎం స్వయంగా దిగజారుస్తూ, ఏ ఆసరాతో లక్ష కోట్ల అదనపు భారం పడే ఆరు గ్యారెంటీలను అమలు చేయగలరు? హామీల మత్తు మందును ఊరూరా చల్లి, ఓట్లను కొల్లగొట్టిన హస్తం పార్టీ ప్రభుత్వం ఇప్పుడు 'ఓ స్త్రీ రేపు రా' తరహా తలుపు మీద రాతలా మారింది. దారిద్ర్యరేఖ దిగువనున్న నిరుపేదల వివరాలు, అభివృద్ధి పథకాల అర్హుల సమాచారం ఉండగా, వెంటనే అమలుచేస్తామన్న హామీలను అమలు చేయకుండా ఈ దరఖాస్తుల నాటకాలెందుకు? జనాల బతుకు ఆశల పత్రాలను పప్పు బెల్లం పొట్లాలుగా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంలో అర్థం ఉన్నదా? నిత్యం కంచెలు, కరెంటు, కాళేశ్వరం, ఖజానాపై విషం చిమ్మడానికే పరుగులు పెడుతూ, ప్రభుత్వాన్ని ప్రతికారేచ్ఛకు కాంగ్రెస్ సర్కార్ పావుగా మార్చుకుంటున్నది. నిన్నటిదాకా మోపిన నిందలను నిజమని చూపేందుకు, హామీల అమలుకోసం ఎదురుచూస్తున్న ప్రజల దృష్టిని మళ్లించేందుకు నెల రోజులుగా నానా తంటాలు పడుతున్న ముఖ్యమంత్రిని, మంత్రి మండలిని చూసి జనాలు ముక్కున వేలేసుకుంటున్నారు. గరీబీ హఠావో నినాదం ఇచ్చి, మరోవైపు నీరు పోసి దారిద్ర్య వనాన్ని దేశమంతా పెంచిన చరిత్ర కాంగ్రెస్‌ది. అదే వారసత్వ చరిత్ర చేయందుకొని, నోటితో చెప్పి నొసలుతో వెక్కిరించినట్టుగా తెలంగాణ ప్రజలతో చెలగాటమాడుతున్నది రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం.

నెల రోజుల కాంగ్రెస్ సర్కార్ ముప్పుతిప్పల పాలన, ప్రచారంలో రామచిలుకలా, పాలనలో పిశాచిలా ప్రవర్తిస్తున్న తీరు బుద్ధి జీవులందరికీ ఆవేదన కలిగిస్తున్నది. హామీలతో మునగచెట్టు ఎక్కించిన జనాలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నది. సహవాస దోషమో ఏమో కానీ సీఎం రేవంత్ రెడ్డికి ప్రపంచ బ్యాంకు తెలివితేటలు బాగానే అబ్బాయి. ప్రగతిభవన్ పేరు మార్చి, పూలే ప్రజా భవన్ అని నామకరణం చేసి, దాన్ని డిప్యూటి సీఎం భట్టికి కేటాయించి, పూలే పేరున్న భవనంలో తనుండలేననే సంగతి చెప్పకనే చెప్పేశారు. పైగా ఆ భవన్ వాస్తు భట్టికి కలిసొచ్చి ఏ అనుకూల ప్రయత్నాలైన మొదలు పెడతాడేమో ననే అనుమానంతో నమ్మకమైన సీతక్కను ద్వారం దగ్గరనే సీఎం కాపలా పెట్టేశారు. ఇంకా విచిత్రమేమంటే సీఎం ఉండే భవనానికి రక్షణ ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉంటాయి. రేవంత్‌రెడ్డి ఆ భవన్‌లోనే ఉండనప్పుడు అక్కడ కంచెలెందుకు? అయినా వాటిని తొలగించి, సంకెళ్లు విడిపించానని ప్రచారం చేసుకోవడం ఎంత తెలివో కదా? మరోవైపు ప్రజా భవన్ ప్రజలకు అందుబాటులోకి అనే నినాదం ఇచ్చి, ప్రజా దర్బార్‌ను మళ్లీ మొదలు పెడుతున్నామని ప్రకటించి, నాలుగైదు రోజులు మీడియాలో ఊరేగి, తర్వాత అధికారులతోనే ప్రజావాణిని సాగించడం హాస్యాస్పదమే. మాటలు కోటలు దాటిస్తూ, చేతలు మాత్రం చెవిలో పువ్వులు పెట్టడానికేనన్నట్టుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనులున్నాయి. ప్రతి అడుగులో ప్రచార యావ తప్ప ప్రజాకోణం ఇసుమంతైన కానరావడం లేదు. గులాబీ పార్టీది దుబారా సర్కార్ అని నింద మోపి, హస్తం పార్టీ సర్కార్ మాత్రం దినపత్రికలలో భారీ ప్రకటనలివ్వడం పొదుపవుతుందా? ఫామ్‌హౌజ్ పర్యటనలకు ప్రజాధనం దుర్వినియోగమైందని అభాండాలేసి, నెల రోజుల్లోనే ఆరుసార్లు ఢిల్లీ పర్యటనలు చేయడం కాసులు కూడబెట్టే పనులేనా అనేది ప్రజలకు అర్థమైపోతున్నది. కాన్వాయ్ కార్లయినా, ట్రాఫిక్ నిలుపుదలైనా ఇలా ఏదైనా మీడియాకు మసాలా, సీఎం రేవంత్ రెడ్డికి ఉండితీరాలన్నట్టుగానే ఉన్నది కదా? ప్రజల కోసం తపన పడే నాయకులు పనికిమాలిన అంశాలపై దృష్టి నిలపరు. పగ చుట్టూ ఫ్యాక్షన్ సర్కార్‌ను నడిపించాలని అసలుకే అనుకోరు. మరి రేవంత్‌రెడ్డి సర్కారు చర్యలను చూసిన తర్వాత ఏమనుకోవాలో ఆలోచనాపరులందరూ అర్థం చేసుకోవాలి.

ప్రజా పాలనగా గుండెల్లో ఉండాలంటే, గత పాలనలో మంచిని కొనసాగిస్తూ, దానికి మించిన, మరింత తోడ్పాటును ప్రజలకు అందించాలి.

> మార్పు అంటే రద్దులు, దర్యాప్తులు కాదు.. అధికార పార్టీలో, నేతల్లో హుందాతనం. నిండు కుండలా నడువాలే కానీ, నడమంత్రపు సిరిలా దుందుడుకుతనం కాంగ్రెస్ పార్టీనే దెబ్బ తీస్తుంది. రైతుభరోసా రూ.15 వేలు వేయడానికి, రైతుబీమా చెక్కులివ్వడానికి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంచడానికి ఏ డాటా కావాలో? పండించిన వరి పంట, క్వింటాలు మద్దతు ధరకు అదనంగా రూ.500 అందివ్వడానికి అడ్డుపడే అంశాలేం లేవు కదా? ఇలా 420లో తక్షణమే అమలుకు అవకాశం ఉన్న హామీలు ఎన్నో ఉన్నా, అమలుపరచకుండా అందరితో ఆడుకోవడం విడ్డూరం.

చివరికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కూడా సరిగ్గా అమలు చేయకుండా ఆర్టీసీ బస్సులను గాంధీ భవన్‌లాగా మార్చివేసి తన్నులాట తమాషా చూస్తున్నారు. ప్రజా పాలనలో వైఫల్యాలను, విజిలెన్స్, సిట్టింగ్ జడ్జి దర్యాప్తు మసాలా వార్తలతో ఎన్నో రోజులు దాచిపెట్టడం సాధ్యం కాదు. యూపీఎస్సీ పనితీరును ముఖ్యమంత్రి, మంత్రి గంటలోనే అధ్యయనం చేసి, ఔపోసన పట్టే మేధస్సు ఉన్నప్పుడు, టీఎస్‌పీఎస్సీకి సంబంధం లేని ఇతర సర్కార్ భర్తీ ఏజెన్సీల నోటిఫికేషన్లకు సమయమెందుకు అవసరమో సమాధానం చెప్పాలి కదా? నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీలు, ఖాళీ శాఖల మంత్రుల భర్తీకి ఢిల్లీ చుట్టూ తిరుగుతూ చూపుతున్న చొరవ, కొలువులు నింపే కార్యాచరణకు మాత్రం చూపడం లేదు. ఎందుకని? కొత్తవి కాదు కదా గత ప్రభుత్వమే నోటిఫై చేసిన ఖాళీల భర్తీ ప్రక్రియ మొదలుకు నెల రోజులైనా అడుగులు పడవెందుకు? మనసు నిండా రానున్న లోక్‌సభ ఎన్నికలే కానీ, నమ్మి ఓట్లేసిన జనాలు లేనే లేరన్నది అర్థమవుతూనే ఉన్నది. సీఎం మనసులో లేనే లేని జనం, పాలనలో మాత్రం ఎలా స్థానం దక్కించుకోగలరు?

మొత్తానికి 'నమ్మితిరా సిద్ధా అంటే తన్నితిరా సిద్ధా' అన్నట్టుగా కాంగ్రెస్ సర్కార్ పనితీరు కనపడుతున్నది. చివరికి ప్రజా పాలన కార్యక్రమంలో జనం సమర్పించుకున్న దరఖాస్తులను నడిరోడ్డుపై ఆరబోస్తున్నది. ఇలాంటి ఎన్నో సర్కార్ హాస్యాస్పద పనులు ప్రజల హృదయాలను గాయపరుస్తున్నాయి. జమాఖర్చుల పద్దును లంకెబిందెలుగా ఊహించుకొని పీఠమెక్కిన వారికి ప్రజాకోణం ఉంటుందనుకోవడం అమాయకత్వమే. తలసరి ఆదాయంలో, జీఎస్డీపీలో తల ఎత్తుకొని నిలిచిన తెలంగాణను మళ్లీ తన్లాటల్లోకి నెట్టకుంటే అదే పదివేలు అనే లాగా పాలన సాగుతున్నది. ఒకవైపు జూరాల, కల్వకుర్తి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు యాసంగి పంటలకు సాగు నీరు ఇవ్వలేక క్రాప్ హాలిడే ప్రకటిస్తూ, మరోవైపు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన కాళేశ్వరం ప్రాజెక్టుపై పాలనా విషం కుమ్మరించే కుయుక్తులు పారించడం కాంగ్రెస్ నైజానికి నిదర్శనం. కరెంట్ కోతలను నివారించే చర్యలు లేవుగానీ, పదేండ్ల పాటు 24 గంటల విద్యుత్తు వెలుగులు సరఫరా చేసిన ట్రాన్స్‌కో, జెన్‌కోలలో భస్మాసుర హస్తం పెడుతున్నారు. దశాబ్దిలో రాష్ట్రం సాధించిన పురోగతికి అధికారిక గణాంకాలే సాక్ష్యం. కేంద్ర ప్రభుత్వ అవార్డులే ఆధారం కదా? అప్పుల అభాండాలకు సమాధానం రిజర్వ్ బ్యాంకు గణాంకాల్లో వెతుక్కోవచ్చు. కేసీఆర్ ప్రభుత్వం సమకూర్చిన ఆదాయం, సకల రంగాల్లో ప్రతిష్ఠించిన ఆత్మ విశ్వాసానికి వెలకట్టగలమా? రాఫెల్, 2 జీ స్పెక్ట్రమ్, కామన్వెల్త్, కార్గిల్ శవ పేటికలు ఇలా ఎన్నో లక్షల కోట్ల కుంభకోణాల ఆరోపణలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్, బీజేపీల పెద్దలపై ఉన్నాయి. వారి చేతివాటం ఘనకీర్తినే బీఆర్‌ఎస్‌తో సహా, వివిధ రాష్ట్రాల భూమి పుత్రుల రాజకీయ శక్తులైన అనేక ప్రాంతీయ పార్టీల నేతలకు అంటించాలని కుట్రలు పన్నుతూనే ఉన్నారు. రేపటి వైపు నడిపించే దార్శనికత్వానిది ప్రజా పాలనగా చరిత్రలో నిలుస్తుందే కానీ, కుట్రదారులది కానే కాదు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ప్రగతి దృక్పథాన్ని ప్రేమిస్తారే కానీ, పగ ధోరణిని కానే కాదు. బొటాబొటి మెజారిటీతో అధికార పగ్గాలు చేపట్టినా, నిజంగా ప్రజా పాలనను శాస్త్రీయ దృక్పథంతో అమలు జరిపితే, కాంగ్రెస్ పార్టీ సర్కార్ పదిమంది మెప్పు పొంది ఉండేది. కానీ, అలా అమలుచేస్తే అది కాంగ్రెస్ పార్టీ ఎందుకవుతుంది?

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

# డ్రాగన్ ప్రశంసల వెనుక డ్రామా!

మన దేశానికి పక్కలో బల్లెం వంటి దేశం ఏదైనా ఉంది అంటే అది చైనా మాత్రమే. ఆ దేశంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా దాని తీరు మాత్రం మారడం లేదు. మన దేశంపై విషం కక్కడం, మనం తీసుకునే నిర్ణయాలకు అడ్డు రావడం, ఐక్యరాజ్యసమితిలో ప్రతికూలంగా వ్యవహరించడం, మన శత్రు దేశాలకు వత్తాసు పలకడమే డ్రాగన్ పనిగా పెట్టుకున్నది. 1962 నాటి యుద్ధం నుంచి నిన్నమొన్నటి గల్వాన్ లోయ ఉద్రిక్తతల వరకు చైనా ఇదే రీతిలో వ్యవహరించింది. కానీ, ప్రసుతం చైనా తీరు కొంచెం మారినట్టు కనిపిస్తున్నది. భారత విదేశాంగ విధానాన్ని మెచ్చుకోవడమే అందుకు తాజా ఉదాహరణ. ఆ దేశ ప్రభుత్వ అజమాయిషీలో నడుస్తున్న మీడియాలో భారత్‌ను కీర్తిస్తూ ఒక కథనం ప్రచురితం కావడం మరో విశేషం.



అవీక్ బెనర్జీ
'ఇండియా టీవీ' సౌజన్యంతో...

చైనాలోని 'గ్లోబల్ టైమ్స్' అనే ఒక పత్రిక భారత్‌ను ప్రశంసించడం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. ఆ పత్రికలో ప్రచురితమైన వ్యాసంలో భారత విదేశాంగ విధానం, దౌత్యపరమైన విజయాలు, ఆర్థిక విధానాలను కీర్తించడం గమనార్హం. షాంఘైలోని ఫుడాన్ వర్సిటీకి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ సౌత్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ జాంగ్ జియాడాంగ్ ఈ వ్యాసాన్ని రాశారు. గత నాలుగేండ్లలో ప్రధాని మోదీ హయాంలో భారత్ సాధించిన పలు విజయాలను ఇందులో ప్రస్తావించారు. చైనా పత్రికలో మోదీ ప్రభుత్వం, భారత ప్రగతి గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి. అరుదైన విషయం కూడా. మొదటి నుంచి భారత్‌తో ఉప్పు నిప్పులా వ్యవహరించే చైనా, మోదీ సర్కార్‌తోనూ ఇదే రీతిలో వ్యవహరిస్తూ వచ్చింది. పైగా గల్వాన్ లోయలో జరిగిన సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత ఆ దేశం భారత్ పట్ల ప్రతికూల వైఖరితో ఉన్న విషయం తెలిసిందే. అమెరికాతో భారత ప్రభుత్వం సత్సంబంధాలు కలిగి ఉండటంతో చైనా మనతో చాలాకాలంగా మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నది. కానీ, గతేడాది ఢిల్లీ వేదికగా జరిగిన జీ-20 సమావేశాలు విజయవంతమైన తర్వాత చైనా వైఖరిలో కొంత మార్పు వచ్చిందనే చెప్పవచ్చు.

2020లో ఎల్‌ఏసీ వద్ద గల్వాన్ లోయ సమీపంలో చెలరేగిన ఉద్రిక్తతల కారణంగా రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొన్నది. సరిహద్దుల వెంబడి చైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నది. రోజురోజుకూ భారత భూ భాగాలను ఆక్రమిస్తూ ఆ దేశం మరింత ముందుకు దూసుకువస్తున్నది. శాటిలైట్ చిత్రాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సైనికాధికారుల స్థాయిలో, దౌత్యపరమైన పద్ధతిలో అనేకసార్లు చర్చలు జరిగినప్పటికీ ఈ వివాదం కొలిక్కి రాలేదు. సరిహద్దుల వద్ద సాధారణ స్థితిని తీసుకురావాలని భారత్‌పై చైనా ఒత్తిడి చేస్తునే ఉన్నది. కానీ, చైనా బలగాలను సరిహద్దు వద్ద నుంచి ఉపసంహరించకుండా తాము వెనక్కి తగ్గబోమని భారత్ కూడా దీటుగా జవాబిస్తున్నది. దీంతో ఈ విషయంలో చాలాకాలంగా ప్రతిష్ఠంభన నెలకొన్నది.

గ్లోబల్ టైమ్స్‌లో ప్రచురితమైన వ్యాసం విషయానికి వస్తే.. 'భారత్ నెరేటివ్' దిశగా మోదీ సర్కార్ పయనిస్తున్నదని వ్యాస రచయిత జాంగ్ కితాబిచ్చారు. అందుకోసం వ్యూహాత్మకంగా, చురుగ్గా ముందుకెళ్తున్నదని అందులో పేర్కొన్నారు. వాణిజ్య అసమతుల్యతపై గతంలో, ప్రస్తుతం భారత్ అనుసరిస్తున్న విధానాన్ని ఆయన ఉదహరించారు. 'చైనా-భారత్ మధ్య వాణిజ్య అసమతుల్యత విషయంలో భారత్ విధానం గతంలో వేరుగా ఉండేది. వాణిజ్య అసమతుల్యతను తగ్గించడమే అప్పట్లో లక్ష్యంగా పెట్టుకునేది. కానీ, ప్రస్తుతం భారత్ తన విధానాన్ని మార్చుకున్నది. ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచడంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నది. ఇదే అప్పటికి, ఇప్పటికి ప్రధాన వ్యత్యాసం' అని జాంగ్ తన వ్యాసంలో విశ్లేషించారు.



ప్రధాని మోదీ హయాంలో అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని కూడా జాంగ్ కొనియాడారు. మల్టీ అలైన్‌మెంట్ అప్రోచ్ విధానాన్ని అనుసరిస్తూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరించి అమెరికా, జపాన్, రష్యాలతో సంబంధాలను మరింత మెరుగుపరుచుకున్నదని వ్యాస రచయిత పేర్కొన్నారు. అదే సమయంలో ఇజ్రాయెల్-గాజా పోరులోనూ భారత్ స్పష్టమైన వైఖరిని ప్రదర్శించిందని కితాబిచ్చారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని చెప్తూనే, గాజా ప్రజలకు సాయం అందాలని భారత్ పేర్కొనడాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

గత నాలుగైదేండ్లుగా ప్రపంచశక్తిగా ఎదిగేందుకు భారత్ ప్రయత్నిస్తున్నప్పటికీ, 2023లో ఆ దిశగా మోదీ ప్రభుత్వం కీలక విజయాలను సాధించిందని జాంగ్ తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో అభిప్రాయ భేదాలున్నప్పటికీ జీ-20 సమావేశాల్లో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించుకోవడం భారత దౌత్య విజయానికి ఉదాహరణ అని ఆయన కీర్తించారు. జీ-20 కూటమిలో ఆఫ్రికా యూనియన్‌ను చేర్చుకునే విషయంలో భారత్ చేసిన కృషి సత్ఫలితాలిచ్చిందని చెప్పుకొచ్చారు.

> భారత్‌పై ఎప్పుడూ విషం కక్కే డ్రాగన్ తాజా వైఖరిపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. భారత విధానాలను పొగుడుతూ రాత రాయాల్సిన అవసరం ఆ దేశానికి ఏమొచ్చిందనే విషయాన్ని ఆలోచించాలి. చైనా తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక దాని స్వప్రయోజనాలు కచ్చితంగా ఉంటాయని మర్చిపోవద్దు. చైనా తాజా వైఖరికి, మాల్దీవులకు సంబంధం ఉండొచ్చు.

చైనా అనుకూల వ్యక్తిగా పేరుగాంచిన మహమ్మద్ ముయిజు మాల్దీవులు కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి ఆ ద్వీప దేశం మనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. తాజాగా ఇరు దేశాల మధ్య వివాదం చెలరేగింది. అదే సమయంలో ముయిజు చైనా పర్యటనకు వెళ్లారు. చైనాకు దగ్గరవుతున్న మాల్దీవులకు భారత్ వల్ల ఎటువంటి నష్టం జరగకూడదనే ఉద్దేశంతోనే చైనా ఈ విధానాన్ని అనుసరిస్తున్నదని అర్థమవుతున్నది. అందుకు బలం చేకూరే విధంగా తాజాగా 'గ్లోబల్ టైమ్స్'లో మరో కథనం ప్రచురితమైంది. మాల్దీవులు సహా ఇతర దేశాల పట్ల భారత్ విశాల దృక్పథంతో వ్యవహరించాలని అందులో ఉపదేశం ఇచ్చింది. అందుకే ఎన్నడూలేని విధంగా భారత విధానాలను కొనియాడుతూ చైనా పత్రికలో వ్యాసం ప్రచురితమైందని స్పష్టమవుతున్నది. పాకిస్థాన్, శ్రీలంకలో పెట్టుబడులు పెట్టి ఆ దేశాలను తనకు అనుకూలంగా మార్చుకున్న చైనా.. మాల్దీవులను కూడా భారత్‌కు వ్యతిరేకంగా ఉసిగొల్పుతున్నదనే విషయాన్ని మరువకూడదు.

అనువాదం: మాలోతు సురేష్



# మెట్రో వంకరలు


హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు మెట్రో రైలు పాత్ర ఎంతో కీలకం. రోజువారీ పనుల నిమిత్తం మహానగరంలో ఒక వైపు నుంచి మరో వైపునకు ప్రయాణించే మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు మెట్రో మార్గం వరప్రదాయిని. మెట్రో ప్రాముఖ్యాన్ని గుర్తించిన గత ప్రభుత్వం దాన్ని మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రచించింది. అందులో భాగంగా రాయదుర్గం నుంచి విమానాశ్రయం వరకు 31 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కార్ ఈ మార్గాన్ని రద్దు చేయటం విచారకరం. ఈ మార్గానికి ప్రత్యామ్నాయంగా పాత బస్తీ మీదుగా విమానాశ్రయానికి వెళ్లేందుకు మెట్రో లైన్‌ను ప్రతిపాదించడం ఆశ్చర్యకరం. హైదరాబాద్ నగర మ్యాప్‌ను చూస్తే లంగర్‌హౌజ్, బండ్లగూడ, అత్తాపూర్, నార్సింగి, మణికొండ, గండిపేట, ఖాజాగూడ తదితర నైరుతి వైపున్న ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ తక్కువ. ఆయా ప్రాంతాలవాసులు మెట్రో కోసం రాయదుర్గం వరకు వెళ్లాలి.

మైండ్‌స్పేస్ నుంచి మణికొండ, నార్సింగి వైపు వెళ్లే ప్రయాణికులకు రాత్రిళ్లు ఆటోలు, క్యాబ్‌లు దొరకవు. ఈ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఐటీ ఉద్యోగులతో పాటు ఇతరులు కూడా అధిక సంఖ్యలో హైటెక్ సిటీ, రాయదుర్గం వైపునకు వెళ్తుంటారు. అంతేకాకుండా చారిత్రక ప్రదేశాలైన కుతుబ్‌షాహీ టూంబ్స్, గోల్కొండ కోట, తారామతి పేట, గండిపేట చెరువును సందర్శించే వారికి మెట్రో ఉపయుక్తంగా ఉంటుంది. రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వైపు వెళ్లేవారికి ఓఆర్ఆర్ ఉంది కాబట్టి మెట్రో రైలు అవసరం లేదని ముఖ్యమంత్రి చెప్పడం సరైనది కాదు. విమానాశ్రయం వరకు లైన్ ఉన్నంతమాత్రాన ప్రతిఒక్కరూ ఎయిర్‌పోర్టుకే వెళ్లరు. ఆ మార్గమధ్యంలో ఉన్న గ్రామాలు, ఇతర ప్రాంతాలకు పోవడానికి మెట్రో రైలు సదుపాయం అవసరం. పీవీ ఫ్లైఓవర్ కేవలం విమానాశ్రయానికి వెళ్లే వారికే ఉపయోగకరం. ఈ మార్గంలో మెట్రో సాంకేతికంగా వీలుకాదు. కాబట్టి కనీసం సమీపంలోని షేక్‌పేట, మణికొండ, నార్సింగి, బండ్లగూడలను కలుపుతూ కొత్త లైన్ వేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం.. మణికొండ నుంచి మెట్రోలో ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే రాయదుర్గం నుంచి ఎంజీబీఎస్, చార్మినార్, శాలిబండ మీదుగా వెళ్లాలి. తూర్పున హయత్‌నగర్, పశ్చిమాన పటాన్‌చెరు, ఉత్తరాన శామీర్‌పేట, దక్షిణాన పాతబస్తీ వాసులకు మెట్రో సేవలు అందుబాటులోకి తీసుకొని వచ్చినట్టే నైరుతి ప్రాంతవాసులకు కూడా మెట్రో రైలు సేవలు అందించాలి. కాబట్టి మెట్రో రైలు లైన్‌ను పూర్తిగా రద్దు చేయకుండా కనీసం నార్సింగి, మంచిరేవుల వరకైనా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గుతుంది. ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ మెరుగవుతుంది.

- చంద్రహాస




## గుండెపై భారం దిగింది

సుప్రీంకోర్టు తీర్పు నాకెంతో ఉపశమనం కలిగించింది. ఆ తీర్పు విన్న వెంటనే కన్నీళ్లు ఉబికివచ్చాయి. గత ఏడాదిన్నర కాలంలో నేను మొదటిసారి నవ్వాను. ఆ ఆనందంలో నా పిల్లలను గుండెకు హత్తుకున్నా. నా గుండెపై ఉన్న భారీ పర్వతం తొలగిపోయిన అనుభూతి కలిగింది. అసలైన న్యాయం అంటే ఇదే. నన్ను గెలిపించిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు. నేనిప్పుడు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోగలను.

- బిల్కిస్ బానో

